నేను కొంచం పెదిగింతర్వాతకూడా వాళ్ళిద్దరూ నా విష యంలో పోట్లాడుకుంటూనే వుండేవారు. మానాన్న నన్ను బళ్ళోకి వెళ్ళమని కొడితే అమ్మ ఓర్చుకోలేక కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంటూ "నాణ్ణి మీరు బతకనివ్వరు" అని పోట్లాడేది. నాన్న బయటకువెళ్ళగానే ఇవీ ఎవీ కొనిపెట్టి "బళ్ళోకి వెళ్ళక పోతే పోన్లే నాయనా, ఇంట్లోనేవుండు" అని బుజ్జగించేది. మానాన్న సాయంకాలంవచ్చి అడిగితే బడికి వెళ్ళివొచ్చాడని చెప్పేది. ఇప్పటిదాకా చదువుకోని ఇప్పుడే కన్నుమూశాడు అని చెప్పేది... ఇట్టా జరుగుతుండగా నాన్న కాలంచేశాడు."

అతను కథచెప్పే పద్ధతి సుందర్రావుకి నచ్చలేదు. అసలు కథకూడా అతనికి ఏమంత బాగాలేదు. అయినా చేసేదిలేక వింటున్నాడు.

"ఇకేముంది? నాన్న చచ్చిపోగానే నాకు స్వరాజ్యం వొచ్చింది. చేతినిండా డబ్బువుంది. వొంట్లో సత్తువవుంది. అప్పుడు ఇట్లావుండేవాణ్ణా? బజార్నపడుస్తుంటే ఆడవాళ్ళు వాకిళ్ళలో నిలబడి ఏంచూసేవారు? కొద్దికాలంలోనే నాకు చెడు సావాసాలూ దురభ్యాసాలూ ఎక్కువైనై. ఒక్కటాగుడేనా? ఒక్క ముండలేనా? — సమస్తం అలవాటు పడ్డయ్...డబ్బు పిచ్చల విడిగా ఖర్చుపెట్టటం సాగించాను. నేను ఎక్కడకష్టపడ తానో, కోపంవచ్చి ఏంచేసుకుంటానో అని అమ్మకూడా ఏమీ అనేదికాదు. ఎవ్వరయినా చెప్పినా, "అంతా వొట్టిది- నాబిడ్డ బంగారం- గిట్టనివాళ్ళు వేసేమాటలు" అని పోట్లాడేది, లోలోపలమాత్రం "పెళ్ళిఅయితే వాడే బాగుపడతాడు" అని

